సాక్షి
మహబూబాబాద్
గురువారం | 3 | ఏప్రిల్ | 2025



ఎటు చూసినా..ఎర్ర బంగారమే!
వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 95వేలకు పైగా మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.
- 8లో▸



గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి
అటవీ ప్రాంతంలోని గొత్తికోయ గూడేల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/22^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. వాతావరణంలో మార్పుల కారణంగా పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి



మహబూబాబాద్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 3 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని దానికి తగ్గట్టు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సెల్ ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దన్నారు. ఈ సమావేశంలో డీఈఓ రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, అధికారులు పాల్గొన్నారు.

బిహార్ గవర్నర్‌ను కలిసిన మౌంటైనర్ యశ్వంత్



మరిపెడ రూరల్: మరిపెడ మండలం భూక్య తండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను బీహార్ రాజ్‌భవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యశ్వంత్ తన ఫొటో ఫ్రేమ్‌ను గవర్నర్‌కు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తనవంతు ప్రోత్సాహం, ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని, విజయం వైపు దూసుకెళ్లాలని యశ్వంత్‌కు గవర్నర్ సూచించారు. ప్రపంచ రికార్డు స్థాయి పర్వతాలను పట్టుదలతో అధిరోహించి భారత దేశ ఖ్యాతిని యావత్ ప్రపంచానికి చాటాలని గవర్నర్ కోరారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి



మహబూబాబాద్ అర్బన్: ఈ నెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీ కేంద్ర ప్రభుత్వం ద్వారానే వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం బూటకపు మాటలు చెబుతుందన్నారు. రాజీవ్ యువ వికాసంలో ఎమ్మెల్యేల జోక్యం ఎందుకన్నారు. ప్రతీ ఒక్క నిరుద్యోగికి వెంటనే పథకంలో భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచవల్ శ్యామ్‌సుందర్ శర్మ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, నాయకులు పొద్దిల నరసింహారెడ్డి, పల్లె సందీప్‌గౌడ్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఆదాయం రూ.8.08కోట్లు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ క్రయవిక్రయాలు ఆదాయం 2024–25 సంవత్సరానికి సంబంధించి రూ.8.08 కోట్లు వచ్చిందని ఏఎంసీ చైర్మన్ సుధాకర్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన మార్కెట్ ఆదాయ వివరాలను వెల్లడించారు. ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.7,94,23,000 నిర్దేశించిందని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే ఈ ఏడాది అదనంగా మార్కెట్ ఫీజు రూ.14,02,658 వసూలు అయ్యాయని తెలిపారు. మార్చి 31వ తేదీతో ముగిసిన ఆదాయ రాబడికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిపిన క్రయవిక్రయాలు (గంజ్) ద్వారా రూ.4,72,32,679 వచ్చిందన్నారు. మిల్లుల (డైరెక్ట్) వద్ద జరిగిన క్రయవిక్రయాల నుంచి రూ.49,07,984 ఆదాయం వచ్చిందని, చెక్ పోస్టు ద్వారా రూ.2,21,761 ఆదాయం వచ్చిందని, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలైన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోళ్లు, పౌరసరఫరాల శాఖ, డీఆర్డీఏ సెర్ప్, సహకార శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు జరిపిన ధాన్యం కొనుగోళ్ల ద్వారా రూ.2,84,63,246 ఆదాయం వచ్చిందన్నారు. మొత్తంగా రూ.8,08,25,658 ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి వ్యవసాయం మార్కెట్ ఖాతాకు సంబంధించి ఖజానా (ట్రెజరీ) నిల్వ రూ.12,97,95,527 ఉందన్నారు.

నిధులు వెనక్కి!

గడువులోపు పూర్తికాని ఈజీఎస్ మెటీరియల్ పనులు
- గత ఆర్థిక సంవత్సరం నిధులు రూ.18.37 కోట్లు రిటర్న్
- పనులు చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం
- రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో మానుకోట



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, మహబూబాబాద్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోండ్ పనులకు మంజూరైన నిధులను సకాలంలో వినియోగించలేక పోయారు. గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులు ఖర్చు చేయక నీరస పడ్డారు. దీంతో గతంలో రాష్ట్రంలో నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్న జిల్లా అమాంతం కిందికి పడిపోయింది. రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలోకి వెళ్లింది. ఇందుకు అధికారులే కారణమని చెబుతూ చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు సిద్ధమయినట్లు తెలిసింది.

పడిపోయిన పనిదినాలు..
ప్రతీసారి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యానికి మించి పనిదినాలు నమోదు చేసే మానుకోట జిల్లా గడిచిన ఆర్థిక సంవత్సరంలో చతికిల పడింది. జిల్లాలో జాబ్‌కార్డులు 2.51 లక్షలు ఉండగా ఇందులో 4.55 లక్షల మంది కూలీల పేర్లు నమోదు చేశారు. అయితే ఇందులో 1.42 లక్షల జాబ్ కార్డుల్లోని 2.6 లక్షల మేరకే యాక్టివ్ కూలీలు ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గడిచిన ఏడాది 47 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించింది. కానీ మార్చి 31వ తేదీ నాటికి కేవలం 45 లక్షల పనిదినాలు మాత్రమే చేయించగలిగారు.

రూ.18.37కోట్లు వెనక్కి..
పనులు చేయాలి, పల్లెల రూపురేఖలు మార్చాలని అదనపు నిధుల కోసం ప్రయత్నించే జిల్లాలు ఉండగా ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను కూడా సకాలంలో ఖర్చుచేయని దుస్థితిలో మానుకోట జిల్లా ఉంది. ప్రతీ సంవత్సరం మాదిరిగానే.. ఈ ఏడాది ఈజీఎస్ పనుల లెక్కల ప్రకారం కూలీలకు చెల్లించిన డబ్బులు (వేజ్) 60 శాతం రూ. 85.31 కోట్లు, మెటీరియల్ కాంపౌండ్ నిధులు 40 శాతం రూ. 56.87 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రూ. 36.40 కోట్లతో 726 సీసీరోడ్లు పనులు చేయాల్సి ఉండగా గడువు ముగిసే వరకు కేవలం 525 పనులు మాత్రమే చేశారు. అదేవిధంగా మిగిలిన నిధులతో గ్రామ పంచాయతీ భవనాలు, 16 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం చేపట్టాలి. కానీ వాటిల్లో సగానికి పైగా పనులు ముందుకు సాగలేదు. వీటితోపాటు మండలాల పరిధిలో చేపట్టే పశువుల పాకలు, కిచెన్ షెడ్లు, గొర్రెల పాకలు, చేపల చెరువులు, పౌల్ట్రీ ఫామ్స్ మొదలైన పనులు ముందుకు సాగలేదు.

గతఆర్థిక సంవత్సరంలో పనిదినాల లక్ష్యం :	47 లక్షలు
పూర్తి చేసిన పనిదినాలు :	45 లక్షలు
వేజ్ కాంపౌండ్ నిధులు :	రూ. 85.31 కోట్లు
మెటీరియల్ కాంపౌండ్ నిధులు :	రూ. 56.87 కోట్లు
వినియోగించిన మెటీరియల్ కాంపౌండ్ నిధులు :	రూ. 38.50 కోట్లు
వెనక్కి వెళ్లిన నిధులు :	రూ. 18.37 కోట్లు
నిధుల వినియోగంలో రాష్ట్రంలో జిల్లా స్థానం :	31

దీంతో జిల్లాకు మంజూరైన మెటీరియల్ కాంపౌండ్ నిధుల మొత్తం రూ. 56.87కోట్లకు గాను రూ. 38.50 కోట్లు ఖర్చు చేయగా మిగిలిన రూ. 18.37కోట్లు వెనక్కి వెళ్లాయి. రాష్ట్రంలో సగటున వేజ్ కాంపౌండ్ నిధులు 39.46శాతం ఉండగా లక్ష్యానికి మించి 40.69 శాతంతో ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో ఉండగా 31.10 శాతంతో మహబూబాబాద్ అట్టడుగు స్థానంలో నిలిచింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..
పనులు చేసేందుకు పోటీ పడే కాంట్రాక్టర్లు ఈసారి మాత్రం పనులు చేసేందుకు ఆసక్తి చూపలేదు. ప్రతీసారి ఇలాగే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగచేసుకొనే వారు. పనులు చేసే కాంట్రాక్టర్లను పిలిపించి పనులు చేసేలా ఒపించేవారు. త్వరగా బిల్లులు ఇప్పిస్తామని నమ్మకం కుదిరేలా మాట్లాడి పనులు చేయించేవారు. కానీ ఈసారి జిల్లాలోని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు ఆ దిశగా ప్రయత్నించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లతోపాటు పనులు చేసేవారు కూడా వేగంగా పనులు చేయలేదు. ఈ పరిస్థితిలో ఎప్పుడు ముందు వరుసలో ఉండే జిల్లా అట్టడుగు స్థాయికి పడిపోయింది. ఇందుకు కారణమైన అధికారులపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి శాఖాపరమైన చర్యలకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

ఆలస్యంగా పనులు మంజూరు..
సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పదవిలో లేకపోవడంతో పనులు చేసేందుకు ఎక్కువ మంది ముందుకు రాలేదు. ఆలస్యంగా పనులు మంజూరు కావడంతోపాటు, ఇసుక దొరకక పోవడంతో పనులు వేగంగా చేయలేకపోయాం. దీంతో సకాలంలో నిధులు ఖర్చు కాలేదు.
- విద్యాసాగర్, ఈఈ పంచాయతీరాజ్

టార్గెట్.. 2.50 లక్షల మంది

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడిజిల్లానుంచి జనసమీకరణ
- జన సమీకరణకు ఇన్‌చార్జులుగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఇప్పటికే కేసీఆర్‌తో భేటీ అయిన ముఖ్య నేతలు


సభాస్థలంలో గడ్డపారతో భూమిని తవ్వి పనులు ప్రారంభిస్తున్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీష్ కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్ తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి : వరంగల్ వేదికగా ఈ నెల 27న బీఆర్‌ఎస్ మరోసారి ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహించేందుకు బుధవారం అంకురార్పణ జరిగింది. పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల మహాసభ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సభా పర్యవేక్షకులు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీష్ కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ గ్యాదరి బాలమల్లు తదితరులు భూమి పూజ చేశారు. అంతకుముందు మంగళవారం ఎర్రవెల్లిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముఖ్యనేతలతో సమావేశమైన అధినేత కేసీఆర్.. సభావేదిక, జనసమీకరణ, ఇతర ఏర్పాట్లకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. 10లక్షల మందికిపైగా బహిరంగసభ నిర్వహించాలని, దీనికి కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి 2.50లక్షలమంది జనాన్ని సమీకరించాలని టార్గెట్ పెట్టారు.

జనసమీకరణకు ఇన్‌చార్జ్‌లు..
కేసీఆర్ ఆదేశాలతో 2.50లక్షలమంది జనసమీకరణకు బీఆర్‌ఎస్ పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు అధినేత.. సభా ఏర్పాట్లు, జన సమీకరణకు సంబంధించి ముఖ్యనేతలకు నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించారు. పాలకుర్తి, వర్ధన్నపేటలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనుండగా.. వరంగల్ పశ్చిమను మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌కు అప్పగించారు. వరంగల్ తూర్పును నన్నపునేని నరేందర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలకు, భూపాలపల్లిని గండ్ర వెంకటరమణారెడ్డికి, నర్సంపేట, ములుగు నియోజకవర్గాలకు పెద్ది సుదర్శన్ రెడ్డిలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అదేవిధంగా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ బాధ్యతలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చూడనుండగా, పరకాలను చల్లా ధర్మారెడ్డి, మహబూబాబాద్‌ను సత్యవతి రాథోడ్, శంకర్‌నాయక్‌లు, డోర్నకల్‌ను రెడ్యానాయక్, మాలోత్ కవితలకు అప్పగించారు. సభ ఏర్పాట్లు, జనసమీకరణ తదితర బాధ్యతలు నిర్వహించే హైదరాబాద్‌కు చెందిన పార్టీ రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు వరంగల్ నగరంలోనే మకాం వేయనున్నారు.

నేటినుంచి మరింత వేగంగా పనులు..
సభకు మరో 24 రోజులే గడువు ఉండటంతో గురువారం నుంచి సభా కోసం చేపట్టే పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటివరకు బహిరంగసభకు సిద్ధం చేసిన 1,213 ఎకరాల స్థలంలో.. 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం ఉంటుందని, పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించినట్లు వెల్లడించిన బీఆర్‌ఎస్ నేతలు, మరో మూడు, నాలుగు వందల ఎకరాలు కూడా సమీకరించనున్నట్లు వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌ఓ

మహబూబాబాద్/నెహ్రూసెంటర్: జిల్లాకు నూతన వైద్యారోగ్య శాఖ అధికారిగా డాక్టర్ రవి బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మచారిని కూడా కలిశారు. అలాగే వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

7నుంచి టెన్త్ స్పాట్

- 15 వరకు స్పాట్ వాల్యుయేషన్
- 2.27 లక్షలకుపైగా జవాబు పత్రాలు
- ఏఈలు, సీఈలు కలిపి 1,064 మంది
- స్పెషల్ అసిస్టెంట్లు 450 మంది
- కొనసాగుతున్న కోడింగ్, డీకోడింగ్
- ఉమ్మడి జిల్లాకు కలిపి ఒకే క్యాంపు

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షలు ముగిశాయి. గత నెల 21 నుంచి ప్రారంభమైన టెన్త్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోనే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపును నిర్వహించనున్నారు. కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌ను టెన్త్ స్పాట్ కేంద్రంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు టెన్త్ సబ్జెక్టుల పరీక్షల జవాబు పత్రాల వాల్యుయేషన్ ప్రక్రియ జరగనుంది.

సీనియార్టీ ప్రకారం ఎస్‌ఏలకు విధులు
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని టెన్త్ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్లలో సీనియార్టీ కలిగిన స్కూల్ అసిస్టెంట్లను అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా (ఏఈ), చీఫ్ ఎగ్జామినర్లుగా (సీఈ) నియమించారు. హనుమకొండ డీఈఓ డి.వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. మిగతా జిల్లాల నుంచి వివిధ సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్లను వివరాలను తెప్పించుకుని సీనియార్టీ ప్రాతిపదికన నియమించారు. ఏఈలు, సీఈలుగా కలిపి మొత్తంగా 1,064 మంది స్కూల్ అసిస్టెంట్లను నియమించారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులు కూడా పంపుతున్నారు. స్పెషల్ అసిస్టెంట్లుగా 450 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లను కూడా నియమంచారు. అవసరం కంటే ఎక్కువ మందిని కూడా ఏఈలుగా, సీఈలుగా, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. కొంత మంది స్కూల్ అసిస్టెంట్లు మెడికల్ ఇతర కారణాలు చూపి స్పాట్‌కు రాలేకపోతే మిగతా వారికి అవకాశం ఇస్తారు.

7న ఉదయం రిపోర్టు చేయాలి
కాజీపేటలోని టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఈనెల 7న ఉదయం 9 గంటల నుంచి ఆయా ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. వాల్యుయేషన్‌లో తీసుకోవాల్సిన పలు అంశాలను సంబంధిత అధికారులు వారికి తెలియజేస్తారు. అనంతరం టీచర్లు వాల్యుయేషన్ చేస్తారు. రోజుకు 40 జవాబు పత్రాలు వాల్యుయేషన్ చేస్తారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టీచర్లు స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొంటారు.

జవాబుపత్రాలు రాక..
ఉమ్మడి జిల్లా క్యాంపునకు టెన్త్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి జవాబుపత్రాలు 2.27 లక్షలకు పైగా కేటాయించారు.

కొనసాగుతున్న కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ
ఇప్పటికే చేరుకున్న టెన్త్ పరీక్షల జవాబు పత్రాలకు కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ గత కొద్ది రోజులుగా కొనసాగుతోంది. ఇద్దరు కోడింగ్ ఆఫీసర్లుగా ఇద్దరు పీజీహెచ్‌ఎంలు వ్యవహరిస్తుండగా.. మరో 8 మంది పీజీహెచ్‌ఎంలు అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ ముగియనున్నది.

తాగునీటి సమస్య ఉండొద్దు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో తాగునీటి సరఫరా, రాజీవ్ యువ వికాసం, పెన్షన్లు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అందరికి తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, జెడ్పీ ఈసీఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు
దివ్యాంగులకు యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) నంబర్‌ను కేటాయించి స్మార్ట్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వివరాలు ఆ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అప్‌లోడ్ చేసిన అనంతరం సదరం శిబిరం నిర్వహించే కేంద్రాల్లో దగ్గర ఉండే దాన్ని ఎంచుకోవాలన్నారు. డిజిటల్ సంతకంతో స్మార్ట్‌కార్డు పోస్టు ద్వారా ఇంటి చిరునామాకు పంపిస్తారన్నారు.కార్డులో ఐడీ నంబర్,దివ్యాంగుడి పేరు,వైకల్యశాతం,తదితర వివరాలు ఉంటాయన్నారు. ఆ కార్డుతో రైళ్లు, బస్సు టికెట్లలో రాయితీలు, ఫించన్ తదితర ప్రయోజనాలు ఉంటాయన్నారు.

కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న వర్ధంతి
కలెక్టర్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె వీరబ్రహ్మచారి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నర్సింహస్వామి, నాయకులు వెంకన్న, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- గార్లలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ


కిచెన్ రూమ్‌లో సరుకులు పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

గార్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ వార్డెన్లను ఆదేశించారు. బుధవారం గార్లలోని ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని కిచెన్ షెడ్, స్టోర్‌రూంలను పరి శీలించారు. వసతిగృహాల్లో నీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. టాయిలెట్లు, వాష్ రూంలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలు ఎలా రాసారని అడిగి తెలుసుకున్నారు. చదువుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. అయితే పాఠశాలలో గతంలో నిర్మించిన 16 వాష్‌రూమ్స్ శిథిలమయ్యాయని, కేవలం 6 మాత్రమే ఉన్నాయని, క్వార్టర్స్‌లో ఉండే ఉపాధ్యాయునుల జీపీ సిబ్బంది ఇంటి పన్ను కట్టాలని నోటీసులు ఇచ్చారని కేజీబీవీ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆ విషయాన్ని నేను చూసుకుంటానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంజీవ, ఆర్‌ఐ స్వప్న, హెచ్‌ఎంలు జోగయ్య, ఉషారాణి, వార్డెన్ రాధిక పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు


పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. జిల్లాలో 46 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు జరిగాయని, మొత్తం రెగ్యూలర్ విద్యార్థులు 8,190 మంది కాగా 8,183 మంది విద్యార్థులు హాజరైయ్యారన్నారు. పలు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర, జిల్లా పరీక్షల పరిశీలకులు తనిఖీ చేశారన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయని, పరీక్షలకు సహకరించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, సీఎస్ డీఈఓ, ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు, పోలీస్ అధికారులకు, వైద్యశాఖ, విద్యుత్‌శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పరీక్షల ఫలితాలు వెలువడుతాయని, సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు


కేసముద్రం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మక్కలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 10,516 బస్తాల మక్కలు బుధవారం అమ్మకానికి వచ్చాయి. దీంతో షెడ్లు మక్కల రాశులతో నిండిపోయాయి. ఈ సీజన్‌లో అత్యధికంగా మక్కలు అమ్మకానికి రావడం ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు. క్వింటాకు గరిష్ట ధర రూ.2,224, కనిష్ట ధర రూ.2,071లు పలికినట్లు తెలిపారు.

మానుకోట మార్కెట్‌కు 6,997 బస్తాలు..
మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 6,997 బస్తాల మక్కలు విక్రయం జరుగగా గరిష్ట ధర క్వింటాకు రూ.2,191, కనిష్ట ధర రూ.2,076 పలికిందని ఏఎంసీ చైర్మన్ సుధాకర్ బుధవారం తెలిపారు.

రేణుకకు అశ్రునయనాలతో వీడ్కోలు


అంతిమయాత్రలో పాల్గొన్న జనం

దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మరణించిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుకకు బుధవారం స్వగ్రామమైన దేవరుప్పుల మండలం కడవెండిలో అశ్రునయనాలతో అంతిమవీడ్కోలు పలికారు. అంతకుముందు ప్రజాసంఘాలు, వామపక్ష, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆమె మృతదేహం వద్ద ఘన నివాళులు అర్పించారు. - దేవరుప్పుల

- వివరాలు 8లో▸

క్లుప్తంగా

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్ : తిరుమల తిరుమతి దేవస్థానం ఆధ్వర్యంలో నగరంలోని ప్రగతి నగర్ కాలనీ ఫేజ్-2లో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2025–26 సంవత్సరానికి గాను 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్లు పొందడానికి ఈనెల 2 నుంచి జూన్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.లక్ష్మీనర్సమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థి దివ్యాంగ సదరం, బర్త్, స్టడీ, కులం, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలు, ఆధార్, రేషన్ కార్డులు, పాస్ ఫొటోలు (04) దరఖాస్తు ఫామ్‌లతో జత చేసి అందజేయాలన్నారు. ప్రవేశం పొందిన వారికి 1 నుంచి 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతితో పాటు బోధన ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08702459374, 9440739423, 8008136309 నంబర్లలో సంప్రదించాలని లేదా శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల, మయూరి గార్డెన్ లైన్, ప్రగతి నగర్ కాలనీ ఫేజ్ -2, ఎన్ఐటీ, హనుమకొండలో నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య బుధవారం తెలిపారు.అపరాధ రుసుము లేకుండా ఈనెల 7వతేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 9వతేదీవరకు గడువు ఉందన్నారు. ఫీజుల వివరాలు, పూర్తి సమాచారం సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో ఉందని వారు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా 18 రైళ్ల సర్వీస్‌లు

- సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ మధ్య రాకపోకలు..

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య 18 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌ఏ. శ్రీధర్ బుధవారం తెలిపారు.

రైళ్ల వివరాలు..

సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ సుబేదార్‌గంజ్‌లో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతీ గురువారం బయలుదేరే ఈ రైలు మే 29వ తేదీ వరకు ఆయా నగరాల మధ్య 9 సార్లు నడుస్తుంది. అదేవిధంగా సికింద్రాబాద్‌లో ప్రతీ శనివారం బయలుదేరే ఈ రైలు ఈ నెల 5వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఆయా నగరాల మధ్య 9 సార్లు నడుస్తుందని ఆయన తెలిపారు. థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ కోచ్‌లతో ప్రయాణించే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు ఫత్తేపూర్, గోవింద్‌పూర్, భీమ్‌సేన్, పోక్ర్యాన్, ఒరాయ్, ఝూన్సీ, బీనా, రాణి కమలాపేట్, ఇటార్సీ, నాగ్‌పూర్, బల్హార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

ఎటు చూసినా.. ఎర్ర బంగారమే!

వరంగల్ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి
- లక్ష బస్తాల రాక..ఎరుపు రంగు పులుముకున్న ఏనుమాముల యార్డులు
- సరుకు పెరిగింది.. ధర తగ్గింది
- ఎంట్రీలు లేక బస్తాల లెక్కల్లో తేడా


మిర్చి బస్తాలతో నిండిన వరంగల్ వ్యవసాయ మార్కెట్

వరంగల్: ఏనుమాములకు ఎర్ర బంగారం పోటెత్తింది. సీజన్ ఊపందుకోవడంతోపాటు వారాంతపు సెలవులు శని, ఆదివారం, ఉగాది, రంజాన్ పండుగలతో వరుసగా నాలుగు రోజులు వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మార్కెట్ బుధవారం పునఃప్రారంభమైంది. దీంతో సుమారు 95వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. ఫలితంగా మార్కెట్‌లోని యార్డులతో పాటు బహిరంగ ప్రదేశాలు సైతం మిర్చి బస్తాలతో నిండిపోయాయి. కాగా, ఇంత పెద్ద మొత్తంలో మిర్చి రావడంతోనే ధరలను తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఒకే రోజు బస్తాలు రావడం.. ఎండలు పెరిగిపోవడంతో మార్కెట్‌లోని దడువాయిలు లాట్ ఐడీలు కొట్టడం, హమాలీ కార్మికులు కాంటాలు పెట్టడంలో జాప్యం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. అన్ని రకాల మిర్చి రావడంతో ఘాటు పెరిగి కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున మిర్చి తరలివస్తోంది.

ఎంట్రీలు లేక లెక్కల్లో తేడా..

గతంలో మార్కెట్‌లోకి వచ్చే ప్రతీ వాహనం, అందులోని బస్తాల వివరాలను గేటు వద్ద ఉన్న ఉద్యోగులు నమోదు చేసే వారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. గేటు వద్ద ఎంట్రీ చేసే విధానాన్ని ఎత్తివేశారు. దీంతో ఎన్ని బస్తాలు వస్తున్నాయో సిబ్బంది, అధికారులకే తెలియాలి. ఈ విధానం వల్ల వచ్చిన బస్తాల్లో ఎన్ని జీరో అవుతున్నాయో అంతుచిక్కడం లేదు. రోజూ కనీసం 5వేలకు పైగా బస్తాలు జీరో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్వింటాకు రూ.5వేలు తక్కువ..

గతేడాది ధరలతో పోల్చుకుంటే ఈఏడాది తేజ, యూఎస్ 341, డీడీ, వండర్‌హాట్ తదితర రకాల మిర్చికి క్వింటాకు రూ.5వేలకు పైగా ధరలు తగ్గాయని రైతులు ఆరోపిస్తున్నారు. దిగుబడి తగ్గిందని బాధ పడుతుంటే ధరలు సైతం తగ్గడంతో పెట్టుబడులు రాని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.లక్షన్నర నష్టం..



ప్రస్తుతం ఉన్న ధరతో నాకు ఎకరాకు రూ. లక్షన్నర నష్టం వస్తోంది. 341రకం మిర్చి 42 బస్తాలు తెచ్చా. 11వేలు ధర నిర్ణయం అయ్యింది. నాకు రూ.9వేలు పడింది. గతేడాది ఇదే రకం రూ.14,600 ఉండగా రూ.12,500 పడింది. క్వింటా కాయ కోయాలంటే రూ.4,500తో పాటు ఇతర ఖర్చులు కలిపితే మార్కెట్‌కు వచ్చే వరకు రూ.6,500 పడుతోంది.

-లక్ష్మయ్య, ఏటూరునాగారం, ములుగు జిల్లా

ఏసీలో పెట్టి నష్టపోయా..



ధరలు పెరుగుతాయనే ఆశతో గతేడాది ఏసీలో పెట్టగా నష్టపోయా. ఈఏడాది 341 మొదటి రకం ఉన్నా క్వింటాకు రూ.11,200 పడింది. ఇదే మిర్చి గతేడాది రూ.14 వేలకు కొనుగోలు చేశారు. కూలీ మనిషికి రూ.400 ఇవ్వాల్సి వస్తోంది. గిట్టుబాటు కావడం లేదు.

-ఎన్నపురెడ్డి రమేశ్, బొమ్మాపూర్, భూపాలపల్లి జిల్లా

క్వింటాకు రూ.5వేలు తగ్గింది..



మార్కెట్‌కు 60బస్తాలు డీడీ రకం మిర్చి తెచ్చా. గతేడాది ఇదే రకానికి రూ.16వేలు పలికింది. అదే రకం ఈసారి రూ.10,500 పడింది. నియంత్రణ లేక పోవడం వల్లే వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు.

-బాలమల్లు, పెంకిన గ్రామం, పలిమెల మండలం, భూపాలపల్లి జిల్లా

ఆయిల్ రూపంలో గంజాయి సరఫరా..

- జనగామలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు
- రూ.13.42 లక్షల విలువైన సరుకు స్వాధీనం


పోలీసుల అదుపులో గంజాయి ఆయిల్ సరఫరా చేస్తున్న వ్యక్తులు

జనగామ: ఏపీ నుంచి ఆయిల్ రూపంలో ఉన్న గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన ఘటన బుధవారం జిల్లా కేంద్రం నెహ్రూపార్కు ఏరియాలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన ఏజెంట్లు సురేశ్, నవీన్ మధ్యవర్తుల ద్వారా గంజాయి ఆయిల్‌ను రవాణా చేస్తున్నారు. ఇదే మండలానికి చెందిన గాలి రాహుల్ గాంధీ, సుక్రిల్ లైకాన్ ఆశీష్ పేరుతో ఉన్న ఆయిల్ గంజాయి కవర్లను వెంట తీసుకుని వైజాగ్ నుంచి ఈస్ట్‌కోస్ట్ రైలులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో రైలులో పోలీసులు తనిఖీ చేస్తున్నట్లు గుర్తించిన ఆ ఇద్దరు జనగామ రైల్వేస్టేషన్‌లో దిగి.. నెహ్రూపార్కు ఏరియాకు నడుచుకుంటూ బయలుదేరారు. జంక్షన్‌లో ఎస్సై భరత్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా, వారిని చూసి అనుమానాస్పదంగా వ్యవహరించడంతో వెంటనే పట్టుకున్నారు. తనిఖీ చేయగా, గంజాయితో తయారు చేసిన ఆయిల్ కవర్లను లభించాయి. దీని విలువ రూ.13.42 లక్షలు ఉంటుంది. చింతపల్లికి చెందిన ఏజెంట్లు సురేశ్, నవీన్ ద్వారా ఇద్దరు వ్యక్తులు రాహుల్‌గాంధీ, లైకాన్ రూ.8వేలకు మాట్లాడుకుని హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి ఇచ్చేందుకు వైజాగ్ నుంచి బయలుదేరినట్లు ఎస్సై తెలిపారు. ఈఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- నిర్వాహకురాలు, విటుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు చూపుతున్న టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు అయ్యింది. పోస్టల్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న ఓ మహిళ, నలుగురు విటులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా వేలేరు మండలం శోడషపల్లి గ్రామానికి చెందిన తిమ్మాపురం లలిత సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పోస్టల్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకొచ్చి రహస్యంగా సంవత్సర కాలంగా వ్యభిచారం నిర్వహిస్తోంది. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలు లలితతోపాటు విటులు జనగామకు చెందిన బంతిని అశోక్, బుక్క కరుణాకర్, ఘన్‌పూర్ మండలం మీదికొండకు చెందిన వడ్లకొండ రమేశ్, కాజీపేట విష్ణుపురికి చెందిన బొల్లి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి బాధిత మహిళలను కాపాడినట్లు తెలిపారు. వీరి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.2,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ కోసం నిందితులను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: అటవీ ప్రాంతంలోని గొత్తికోయ గూడేల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సమ్మక్క,సారక్క కల్యాణ మండపంలో ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో జిల్లాలోని 84 గొత్తికోయ గిరిజనులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా గూడేలకు నీరు సరఫరా చేయడంతోపాటు త్వరలో బోర్లు వేయిస్తానన్నారు. అడవులను నరకకుండా కాపాడాలన్నారు. గొత్తికోయ గిరిజనుల్లో కొత్త మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గొత్తికోయ గిరిజనులు మండలాల వారీగా తమ సమస్యలను మంత్రి సీతక్కకు వివరించారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, పిల్లల ఉన్నత చదువు కోసం కుల ధ్రువీకరణ పత్రాలు, రోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, సీఐలు రవీందర్, శంకర్, శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల ప్రత్యేకాధికారి రాంపతి, ఎంపీడీఓ సుమనవాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సతీశ్

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్ వద్ద 16 కిలోల గంజాయి పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. బుధవారం గుజరాత్‌కు చెందిన గౌతం భరత్‌సింగ్ వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. ఇక్కడ పోలీసులు తనిఖీ చేస్తుండగా అప్రమత్తమై ఆటోలో హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సమయంలో పోలీసులకు అనుమానం వచ్చి అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. ఇందులో 16 కిలోల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు.

పార్థసారథి హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు?

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి బోరింగ్ తండా సమీపంలో దారుణ హత్యకు గురైన హెల్త్ సూపర్‌వైజర్ తాటి పార్థసారథి కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో సీఐలు సర్వయ్య, దేవేందర్, రవికుమార్, హథీరాం, సూర్యప్రకాశ్, ఎస్సైలు రూరల్ ఎస్సై దీపిక, తిరుపతి, తాహెబ్ బాబా, గోపి, సతీశ్ బృందాలుగా విడిపోయి నేరస్తులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పార్థసారథి బైక్‌పై వస్తుండగా అతడిని హత్య చేయడానికి నిందితులు భద్రాచలం నుంచి కారులో వెంబడించినట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరించారు. నిందితులు వాడిన కారును గుర్తించి వారిని పట్టుకుని విచారణ చేస్తుండగా సుమారు ముగ్గురు నుంచి నలుగురు నేరానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. కాగా, పార్థసారథిని హత్య చేసిన అనంతరం నిందితులు కారులో నెల్లికుదురు వైపునకు వెళ్లినట్లు గుర్తించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడించనున్నట్లు తెలిసింది.

రేణుకకు అశ్రునయనాలతో వీడ్కోలు

ఎరుపెక్కిన కడవెండి..
- ప్రజాసంఘాలు, పార్టీ నేతల ఘన నివాళి
- కళాకారుల ఆటాపాటలతో దద్దరిల్లిన వీధులు
- నాలుగున్నర గంటలపాటు సాగిన అంతిమయాత్ర



'ఆపరేషన్ కగార్' ఆపాలని నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

దేవరుప్పుల : దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుక అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం వద్ద సందర్శనార్థం రేణుక మృతదేహం ఉంచగా పలువురు ఘన నివాళులర్పించారు. ఉదయం 12. 33 నిమిషాలకు ప్రారంభమైన అంతిమయాత్ర సాయంత్రం 4.44 నిమిషాల వరకు కొనసాగింది. ఆట,పాట, డప్పుళ్లతో కడవెండి వీధులు దద్దరిల్లాయి. ఆదివాసీ ఐక్య వేదిక, అమరుల బంధుమిత్రులు తదితర కమిటీలు 'ఆపరేషన్ కగార్' సత్వరమే ఆపేయాలని ఫ్లెక్సీల ప్రదర్శనతో డిమాండ్ చేశాయి.

ప్రజాసంఘాల ఘన నివాళి..

రేణుక మృతదేహానికి అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు పద్మ కుమారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్, శాంతక్క, విరసం నాయకుడు పాణి, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు రవి చందర్, బి రమాదేవి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనురాధ, కళ, మొగిలిచర్ల భారతక్క, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, ఉస్మానియ యూనివర్సిటీ నాయకులు పృథ్వీ, స్టాలిన్, డీటీఎఫ్ నాయకులు సుదర్శన్, ఇప్ప రాంరెడ్డి, మా భూమి సంధ్య, వేముల పుష్ప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నిర్వాహకురాలు పల్స నిర్మల, ప్రజాకళామండలి నుంచి రాజనర్సింహ, జర్నలిస్టు నాయకులు ఎంవీ రమణ, స్నేహలత, వనజ, మలుపు బాల్‌రెడ్డి, గద్దర్ కొడుకు సూర్యం, వరవరరావు కూతుళ్లు అనల, సహజ, పవన, కటకం సతీశ్, సింగరేణి కార్మిక సంఖ్య నాయకుడు హుస్సేన్, తెలంగాణ యూత్ ఫెడరేషన్ నాయకుడు పనికెర మోహన్ రాజు, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, తెలంగాణ ఉద్యమకారులు సీఎల్ యాదగిరి, చెరుకు సుధాకర్, రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్ కన్నా నివాళులర్పించారు.


రేణుక మృతదేహం వద్ద కుటుంబీకులు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి, పల్లాల నిలదీత..

రేణుక మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రేణుక సోదరుడు జీవీకె ప్రసాద్ తన చెల్లిని పాలక వర్గాలు అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనలో కలిసి వచ్చే క్రమంలో బూటకపు ఎన్‌కౌంటర్లు, అణిచివేత మీ పాలనలో అనుభవించామని, ప్రస్తుతం బీజేపీ సర్కారు చేపడుతున్న 'ఆపరేషన్ కగార్'పై బీఆర్ఎస్ వైఖరి చెప్పాలని పలువురు నిలదీశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు గమనించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తాము వ్యతిరేకమని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు.

ప్రజా ఉద్యమకారులపై రాజ్యహింస కొనసాగింపు..

దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో కొనసాగుతున్న ప్రజా ఉద్యమకారులపై కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రతిపక్షాలతో కలిసి రాజ్యహింస కొనసాగిస్తుందని పౌరహక్కుల సంఘం, ఎబీఎంసీ, విరసం రాష్ట్ర ప్రతినిధులు గడ్డం లక్ష్మణ్, పద్మకుమారీ, పాణి, మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అన్నారు. రేణుక హత్యపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ కగార్'తో పాలకవర్గంచే పట్టే హంతక చర్యలను ప్రతిపక్షాలు నిలువరించే విషయం విస్మరిస్తే ప్రశ్నించే గొంతుకలు కనుమరుగువడమేగాక రాజ్యహింస హెచ్చుమీరుతుందని హెచ్చరించారు.

జాతర ఘర్షణ కేసులో 8 మంది అరెస్ట్

- ఆటో, రెండు బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు సీజ్
- వివరాలు వెల్లడించిన మామునూరు ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతి, పక్కన పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై నరేశ్

సంగెం: ఉగాది రోజు సంగెం మండలం గవిచర్లలోని గుండ బ్రహ్మయ్య జాతరలో జరిగిన ఘర్షణ కేసులో 8 మంది గుండేటి సునీల్, గుండేటి మహేందర్, కొమ్మాలు, రాజు, మెట్టుపల్లి భరత్, గుండేటి రాజ్‌కుమార్, మెట్టుపల్లి చిన్న భరత్, వెల్పుల సిద్దును అరెస్ట్ చేసినట్లు మామునూరు ఏసీపీ బి. తిరుపతి తెలిపారు. మైనర్ నిందితుడు కార్తీక్ పరారీలో ఉన్నాడని ఏసీపీ చెప్పారు. బుధవారం రాత్రి సంగెం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపించి బన్ని మృతి కేసు వివరాలు వెల్లడించారు. గుండబ్రహ్మయ్య జాతరకు మండలంలోని కుంటపల్లికి చెందిన చిర్ర బన్ని(21) వెళ్లాడు. దేవాలయానికి కొద్ది దూరంలో బన్ని సిగరెట్ తాగుతుండగా గవిచర్లకు చెందిన వెల్పుల సిద్దు కాస్త దూరంగా వెళ్లమనగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సిద్దు.. సంగెం గ్రామానికి చెందిన తన మేనమామ గుండేటి సునీల్‌కు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పాడు. దీంతో సునీల్‌తో పాటు మహేందర్, కొమ్మాలు, కార్తీక్, రాజు, భరత్, రాజ్‌కుమార్, చిన్న భరత్ హుటాహుటిన జాతర ప్రాంతానికి చేరుకున్నారు. సిద్దుతో ఎందుకు గొడవ పడ్డావని బన్నిని విచక్షణారహితంగా కొట్టడంతో ఆ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ధని ఫిర్యాదు మేరకు పర్వతగిరి సీఐ రాజగోపాల్ 9 మందిపై కేసు నమోదు చేశారు. బుధవారం విశ్వసనీయ సమాచారం మేరకు పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ వద్ద గల మామిడి తోటలో 8 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి ఆటో, రెండు బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని ఏసీపీ తిరుపతి తెలిపారు.

కడవెండిపై కేంద్ర ఇంటెలిజెన్స్ నిఘా

- రేణుక అంత్యక్రియలకు ఎవరెవరు హాజరయ్యారని ఆరా!
- జిల్లాతోపాటు సమీప ప్రాంతాల నుంచి తరలిన అభిమానులు

జనగామ: జనగామ జిల్లాలో రెండు రోజులుగా కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేసినట్లు తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడువెల్లి రేణుక అలియాస్ చైతే అలియాస్ సరస్వతి మృతిచెందిన విషయం విధితమే. ఆమె స్వగ్రామం జిల్లాలోని దేవరుప్పుల మండలం కడవెండి. బుధవారం స్వగ్రామంలో రేణుక అంత్యక్రియల నేపథ్యంలో స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ), సెంట్రల్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ), ఇతర నిఘా విభాగాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. రెండు రోజులుగా కడవెండికి ఎవరెవరు వెళ్తున్నారనే విషయమై ఆరా తీసినట్లు తెలిసింది. రేణుకకు అంతిమ వీడ్కోలు పలికేందుకు జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మావోయిస్టు సానుభూతి పరులు, మాజీలు, అభిమానులు ఎవరు వెళ్లారనే విషయంపై నిఘా వర్గాలు లెక్క వేసే పనిలో బిజీగా ఉన్నట్లు సమాచారం. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, చౌరస్తా, రైల్వే స్టేషన్‌తో పాటు దేవరుప్పుల రూట్ కడవెండికి వెళ్లే వాహనాలు, ద్విచ క్రవాహనాలు, కాలినడకన వెళ్లే వారిపై ఆయా ప్రాంతాల్లో ఇంటెలిజెన్స్ వర్గాలు కన్నేసినట్లు తెలుస్తోంది. బంధుమిత్రుల కమిటీ, విరసం, రాజకీయ విడుదల కమిటీ ప్రతినిధి బల్లా రవీంద్రనాథ్, పౌరహక్కుల సంఘ ప్రతినిధులు, తదితరులు హాజరు కాగా.. జిల్లా నుంచి సైతం అభిమానులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు తరలి వెళ్లి రేణుకకు తుది వీడ్కోలు పలికారు. మావోయిస్టు పార్టీకి అత్యంత పట్టున్న ప్రాంతం జనగామ కావడం.. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రేణుక దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కావడంతో ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు పలువురు మాట్లాడుకోవడం కనిపించింది.